

# కుళ్లు బుద్ధి

★

రచన :

— శ్రీ రేగులపాటి కిషన్ రావు —

మేఘాలు భయంకరంగా గర్జించాయి. ఎక్కడో పిడుగుకూడా పడ్డట్టుంది.

"శీలం చెడిన నీవు ఇంకా బ్రతుకుటెందుకు?" అని మేఘాలు గర్జించి అడిగినట్లనిపించింది పార్వతికి.

కృష్ణమూర్తి బురదంతా కడుక్కొని మళ్ళీ గదిలోకి వచ్చాడు. శోక దేవతలావున్న పార్వతి నలచి విసిరివేయబడ్డ పువ్వులాగా గదిలో నుండి చటుక్కున బయటకు వచ్చింది. హృదయం భాధతో కృంగిపోతుండగా, కన్నీటితో చెంపలు తడిసిపోతుండగా, శరీరంలోనున్న శక్తినంతా కాళ్ళల్లో కేంద్రీకరించి పరుగులాంటి నడకతో రెండుమూడు క్షణాల్లో కొట్టపు ఆవరణదాటి భయంకరంగా కురుస్తున్న గాలివానలో కలిసిపోయింది.

—ఇక చదవండి

కృష్ణమూర్తి పిడకల గదిలోకి వెళ్ళి అందులోనున్న పచ్చిగడ్డి కట్టలను చూశాడు. పిడకల గదిలో పచ్చిగడ్డి కట్టలుండడ మేమిటని మీరనుకుంటారేమో! ఆ పిడకల గది పశువుల కొట్టములో ఒకభాగం. ఎండకాలంలో పిడకలుచేసి అవి ఎండిన తర్వాత ఆగదిలో పోస్తారు. ఆ గదిలో పిడకలు ఒకప్పుడు తక్కువగానూ, మరొకప్పుడు ఎక్కువగానూవున్నా మొత్తం మీద సంవత్సరం పొడుగునా వుంటాయి. అందుకే ఆగదికి పిడకల గది అని పేరు.

వానకాలం వస్తుందనగానే ఆదేగదిలో దూలాలపై కట్టెలతో చిటుక చేర్పాటుచేసి పిడకలన్నింటినీ చిటుకపైపోస్తారు. తర్వాత ఆగదిలో నేలపై వ్యవసాయపు పనిముట్లు, పచ్చిగడ్డికట్టలు పెట్టుకుంటారు. ఆ గదికి పాత తలుపులున్నాయి.

ప్రస్తుతం గదిలోనున్న చిటుకపై పిడకలున్నాయి. గదిలో నేలపై ఒక గోడ దగ్గర మూడు పచ్చిగడ్డి కట్టలున్నాయి. అందులో రెండు విడువని కట్టలు ఒకటి, విడిచిన కట్ట. విడిచిన కట్టనుండి కొంత గడ్డిని అస్తుక చేసినట్లున్నారు. ఒక మూలకు విరిగిన నాగటికోల వుంది. మరో మూలకు చుట్టబడిన పాతచాప వుంది.

కృష్ణమూర్తి విడిచిన గడ్డికట్టనుండి కొంతగడ్డిని పట్టుకొని ఈనిన ఆవు ముందుకు నడకసాగించాడు. ఆవు లేగను నాకడం ఆపి దగ్గరకు వస్తున్నతని కోపంతో ఉరిమి చూచింది. చేతుల్లో నున్న పచ్చిగడ్డిని చూచిన తర్వాత తినాలని కుతూహలపడింది.

తన లేగను తీసుకపోవడానికి వస్తున్నాడని కోపంతో పొడవడానికి పరుగెత్తి వచ్చిందో, లేక పచ్చిగడ్డి తినాలని పరుగెత్తి వచ్చిందో కాని ఆవు పరుగెత్తి వచ్చింది. తన చేతుల్లోనున్న గడ్డిని పరుగెత్తివస్తున్న ఆవు వైపు విసిరేసి దూరంగా పరుగెత్తాడు. కొంతదూరం పరుగెత్తి

ఆవు తన వెనుక పరుగెత్తిరావడం లేదని గ్రహించి ఆగి వెనుదిరిగి చూశాడు. ఆవు పచ్చిగడ్డిని నోటినిండా పట్టుకొని నములుతూ ఉరిమి చూడసాగింది. లేగ తల్లి దగ్గరకు వచ్చినిలబడింది. అది మల్లెమొగ్గవలె తెల్లగా వుంది.

కృష్ణమూర్తికి లేగలంటే ప్రేమ. అందులో తెల్లని లేగంటే ప్రాణం. లేగలను పరుగెత్తించడమంటే ఆయనకు మహా సంతోషం. ఆవు ముందు నిలబడిన లేగను చూస్తూ లేగను దగ్గరకు తీసుకొని ఎప్పుడు ముద్దాడుదునా, అని తహతహలాడాడు. మేఘ గర్జన వినబడింది. ఆకాశం వైపు చూశాడు. నల్లని మేఘాలు గుంపులు గుంపులుగా పడమటి దిశనుండి వస్తున్నాయి.

వాన వచ్చే సూచన వుంది. వర్షం వచ్చేలోగా గబగబా ఇంటికి వెళ్ళిపోవాలనీ, మళ్ళీ సాయంకాలం వేళ రావాలనీ, పశువులను కొట్టములో తోలిన తర్వాత పాలేరు సహాయముతో లేగను ఇంటికి తీసుక పోవాలనీ నిర్ణయించుకున్నాడు. ఇంటి వైపు నడకసాగించాడు.

కృష్ణమూర్తి కొట్టందాటి అర ఫర్లాంగు దూరం నడిచాడో లేదో వానచినుకులు టప, టప మంటూ పడసాగాయి. నడకను ఆపి నిలబడ్డాడు, నిలబడ్డచోటు నుండి ఇంటికి రెండున్నర ఫర్లాంగుల దూరం వుంది. ఆకాశం వైపు మరోసారి చూశాడు. కాకిరంగులాంటి నల్లని మేఘాలు ఆకాశంలో పయనిస్తున్నాయి.

“భారీవర్షం కురిపిస్తాం అన్నట్టు మేఘాలు మళ్ళీ గర్జించాయి. వెనుకకు తిరిగి పరుగెత్తి కొట్టంలో వున్న గదిలో కూర్చుందామనుకున్నాడు. అతడు వెనుకకు తిరిగి పరుగెత్తివస్తుండగా, కొట్టం వైపు పరుగెత్తి వస్తున్న ఒక స్త్రీ కనబడింది.

కృష్ణమూర్తి కొట్టపు ప్రహారి గోడ నానుకొని వున్న ఈత చెట్టు దగ్గరకు పరుగెత్తి వచ్చేసరికి, ఆ స్త్రీ కూడా ఈత చెట్టు దగ్గరకు పరుగెత్తి వచ్చింది. ఆయువతిని చూచి “ఏం పార్వతీ! ఎక్కడ నుండి వస్తున్నావు” అన్నాడు.

“మిరపతోట నుండి”

“అదిసరే...నీ ముఖం కోపంతో వుందెందుకు?”

“ఆ వెధవ ఒంటరిగా వున్న నన్ను చూచి కన్ను గీటాడు” అని చెప్పి వెంటనే నాలుక కరుచుకొంది. పరుగెత్తిరావడం వలన ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసలు వేగంగా జరుగుతుంటూంది పార్వతి ముఖంలో కోపం చిందులు త్రొక్కుతూవుంది. పార్వతి ముఖంలోకి చూస్తుంటే కృష్ణమూర్తికి వినోదంగా వుంది. పార్వతి ముఖంలోకి మత్తుగా చూస్తూ “కన్ను గీటిందెవరు?” అని ప్రశ్నించాడు. పార్వతి మాట్లాడలేదు, తాను తొందరపడి ఆవిషయం చెప్పినందుకు సిగ్గుపడిపోయింది. తలవంచుకొంది. అతడు మళ్ళీ అడిగాడు “కన్నుగీటిందెవరు పార్వతీ?”

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్ లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

—————— : వివరములకు : ——————

Grams: “NAIDUBROS” Phone: Office: 22409 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

ఊళ్ళో జరిగే చిన్న చిన్న తగాదాలకు తీర్పు చెప్తూ వుంటాడతడు. అతడు రెండవసారి అడగడంతో సమాధానం చెప్పక తప్పలేదు పార్వతికి. నేల చూపులు చూస్తూ కుడికాలు బొటన వ్రేలతో తడిభూమిని రాస్తూ "ప్రకాశరావు దొరగారి వంటసేవకుడు" అంది మెల్లగా. ఆక్షణములో పార్వతి ముఖం పైనున్న కోపం దగ్గరకు అసహ్యం, సిగ్గువచ్చి నిలిచాయి.

"ఎవడు ఆ ఎల్లయ్యేనా"

"అవును"

"వాడిప్పటికి ఎందుకు వచ్చాడు?" అంటూ మళ్ళీ ప్రశ్నించాడు. ఆసమయంలో పార్వతి ముఖంలో మారుతున్న రంగులను పరిశీలిస్తూనే వున్నాడు.

"పచ్చిగడ్డి కోలకు వచ్చాడు లెండి"

ప్రకాశరావుగారి పదెకరాల తోట పార్వతివాళ్ళ తోటను ఆనుకొని వుంది.

ఈరోజు భోజనాలైన తర్వాత ప్రకాశరావు ఎల్లయ్యను గడ్డికోసుక రమ్మని చెప్పాడు. గడ్డికోలకు వచ్చిన ఎల్లయ్య ఒంటరిగా నున్న పార్వతిని చూచి కన్నుగీటాడు.

వారం రోజుల క్రితం రంగారావుగారింట్లో వంటపని చేసే రంగమ్మ అనే స్త్రీని బలాత్కరించాడు ఎల్లయ్య. ఆమె ఎల్లయ్యను చెప్పుతో కొట్టింది. ఈ విషయం కృష్ణమూర్తికి పాలేరుద్వారా నిన్ననే తెలిసింది. ఎల్లయ్య ఇలా అప్పుడప్పుడు స్త్రీలను బలాత్కరించడం జరుగుతూనే వుంది. అందులో కొందరు స్త్రీలు గ్రామంలో పంచాయతీ పెద్దలైన ప్రకాశరావు, కృష్ణమూర్తి, రంగారావు గార్ల వద్ద మొరపెట్టుకోవడం జరిగింది.

మౌనంగా నిలబడియున్న పార్వతిని చూచి కృష్ణమూర్తి మరో ప్రశ్న వేశాడు. "వాడునీకు కన్నుగీటితే మరి ఏం చేసున్నావు?"

"తిట్టాను కేకలువేశాను. అప్పుడే రోడ్డు మీద ప్రకాశరావు దొరగారి జీపుకారొచ్చి బస్తీకి పోతూవుంది. జీపు చప్పుడు వినిపించగానే ఆవెధవ పారిపోయాడు. కాని వాడు మళ్ళీ మాతోటలోకి వస్తాడేమోనని భయం వేసి ఇంటికి బయలుదేరాను. మార్గమధ్యంలో ఈ మాయదారి వానొకటి ప్రారంభమైంది," ఆందోళనతో చెప్పుకపోతూవుంది.

"మీ తల్లి, మీవదిన తోటకుని రాలేదా? ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"మా తల్లికి ఆరోగ్యం బాగాలేదు. మా వదిన తన కొడుక్కు పాలివ్వడానికి ఇంతకు పూర్వమే వెళ్ళింది." సమాధానం చెప్పింది పార్వతి. ఈతచెట్టు క్రింద నిలబడినా వారిద్దరిపై వానచినుకులు కొన్ని పడుతూనే వున్నాయి. పార్వతి ముఖంపైపడ్డ వానచినుకులు ముత్యాలవలె మెరుస్తూ జారిపోతున్నాయి. ఆమె నుటలముపైనున్న తిలకం వాన నీటితో కరిగి ముక్కుమీదికి వ్యాపించి ముక్కు చివరిభాగం నుండి ఒక్కొక్క చుక్క జారి పైటపైబడి మాయమవుతున్నాయి. తలపై కప్పుకొన్న కొంగు పూర్తిగా తడిసిపోయింది.

పార్వతి ముఖాన్ని ఆదేపనిగా చూస్తున్నాడు కృష్ణమూర్తి. ఆమె సామాన్యమైన రైతు కూతురే అయినా కలవారి ఇంట్లో పుట్టిన అమ్మాయివలె అందంగా సౌకుమార్యంగా వుంది. ఆమె పట్టి అమాయకురాలు. ఆరవ తరగతివరకు చదివినా లోకం పోకడ ఎక్కువగా తెలియదు, కల్లాకపటంలేని మనిషి.

ఈత కమ్మల సందుల్లోనుండి వానచినుకులు ఇద్దరి శరీరాల మీద పడుతూనే వున్నాయి. వారి శరీరాలు చల్లబడిపోతూనే వున్నాయి. కాని పార్వతిని చూస్తుంటే కృష్ణమూర్తి ఇంద్రియాలు ఏమేమో కావాలని విజృంభిస్తున్నాయి. వాన చినుకుల అడ్డంకు వల్ల అస్పష్టంగా కనబడుతున్న దూరపు కొండల వైపు చూస్తూ పార్వతి కృష్ణమూర్తిని గమనించడం లేదు.

కృష్ణమూర్తి భార్య గర్భవతియై రెండు నెలల క్రితమే పుట్టింటికిపోయింది. ఈ రెండు నెలల నుండి స్త్రీ స్పర్శ ఎరుగడు. అతని శరీరం స్త్రీ స్పర్శను బలీయంగా కోరుతూవుంది. ప్రక్కన నిలబడ్డ పార్వతి శరీరంతో తన శరీరాన్ని ఐక్యం చేయడానికి తగిన అవకాశం కల్పించుకోవడం కోసం ఆలోచిస్తున్నాడు.

గాలి విపరీతంగా వీచడం వలన ఈత చెట్టు ఊగడం ప్రారంభించింది. ఈత చెట్టు ఆకులను ఆశ్రయించి యున్న నీటిచుక్కలు పెద్దపెద్ద చినుకులుగా మారి పార్వతి, కృష్ణమూర్తులపై పడసాగాయి. నలువైపులా కలియజూచాడు. కనుచూపు మేరలో ఎవ్వరూ కనిపించలేదు. మనస్సులో ఒక ఆలోచన లీలగా మెదిలింది. "పార్వతీ


రవిరాజ్ ఇంటర్ నేషనల్ వారి
"అనుగ్రహం" చిత్రంలో స్మితాపాటిల్.

గాలికి ఈ చెట్టుకూలి మనపై పడే ప్రమాదం వుంది. అలా కొట్టంలోకి పోదాం పదా" అన్నాడు. "పదండి" అంది.

కొట్టంలోకి చేరుకునే సరికి ఇద్దరూ పూర్తిగా తడిసి పోయారు. కొట్టంలో వారు నిలబడిన ప్రాంతమున వారు ధరించిన దుస్తుల నుండి నీరు కారుతూవుంది. భూమిపై పారుతున్న ఆనీటిలో పశువుల మల మూత్రములు కలసి నీరంతా అదోరకమైన రంగునీరుగా మారిపోతూవుంది.

"ఆవు ఈని నట్టుందే! ఈ ఆవు ఈనిన తర్వాత దగ్గరకు వచ్చిన వారిని పొడుస్తుందని మా అన్నయ్య చెప్పాడు. మరి మిమ్ములను కూడా పొడుస్తుందా?" అంది పార్వతి.

ఈనిన తర్వాత వారం పదిరోజుల వరకు దగ్గరకు వచ్చిన ప్రతి వారిని పొడుస్తుంది. మా పాలేరు మల్లయ్యను మాత్రం ఈనిన రోజు కూడా పొడవదు. వాడంటే దానికి కూడల్, ఈనిన తర్వాత వాడే దాని శరీరాన్ని కడుగుతాడు గడ్డివేస్తాడు, పిండిపెడుతాడు, కుడితి పోస్తాడు. వారం పదిరోజులు గాకే జున్ను కాస్తాడు. పాలుపిండుతాడు. వారం పదిరోజుల తర్వాత మాత్రం ఎవ్వరినీ ఏమీ అనదు.

"ఆవు ఎప్పుడు ఈనిందేమిటిని ?"

"ప్రొద్దున...అది ఎలా ఉరిమి చూస్తుందో చూశావా? మన మిక్కడనే నిలబడివుంటే అది ఏక్షణంలో నైనా వచ్చి పొడవ్వచ్చు ఆగదిలో కూర్చుందాంరా".

పార్వతి అమాయకంగా కృష్ణమూర్తి వెంట గదిలోకి వెళ్ళింది. మూలనున్న చాపను తీసి గదిమధ్య పరిచాడు. దానిపైన పచ్చిగడ్డిని పరిచాను.

పార్వతి తన తలపై కప్పుకొన్న పైటకొంగును తీసి చుట్టి పిండసాగింది. నీరు చీరకొంగును వీడి భూమిపైబడి భూమిని తడిపి ముందుకు పరుగెత్తసాగింది. తడిసిన జాకెట్టు నుండి శరీరపు వంపు సొంపులు నిమ్నోన్నతాలు కృష్ణమూర్తి కంటబడగానే ఆయన మనస్సులోనూ శరీరంలోనూ కోరికలు మొరటుగుర్రాలవలె పరుగెత్తసాగాయి. పార్వతి పిండిన కొంగును మళ్ళీ తలపయిన కప్పుకో బోయింది. కొంగును అందుకున్నాడు.

"ఛీ! ఏమిటండీ" అంటూ పార్వతి తన కొంగును మరింత గట్టిగా పట్టుకొంది. ఆకలిగా చూడసాగాడు.

"పారూ! నిన్ను చూస్తుంటే నా మతిపోతుంది. నీ వెంత అందకత్తెవు పారూ! ఇరవై సంవత్సరాల వయస్సువచ్చినా నీ తల్లిదండ్రులు నీకు పెళ్ళిచేయలేదారు మరి నీకు మగవారి స్పర్శకావాలన్న కోరిక జనించదా పారూ! అన్నాడు.

పార్వతి ఏదో అనబోతున్నా వినిపించుకోకుండా దగ్గరకు లాక్కుని బిగ్గరగా కౌగలించుకొన్నాడు, పార్వతి విడిపించుకోవాలని ప్రయత్నం చేయసాగింది. కాని కృష్ణమూర్తి పట్టు వదలలేదు సరికదా తన కామ కోరికలు తీర్చుకోవడానికి తగిన అవకాశాలు కల్పించుకోసాగాడు.

మేఘాలు భయంకరంగా గర్జిస్తున్నాయి గాలివాన బలమెక్కువై ప్రకృతి భీకరంగా తయారైంది.

"పారూ! కేకలెందుకు వేస్తావు? వాన పడుతుంటని నీకు తెలియదా? వాన చప్పుడులో నీ కేకలు ఎంతదూరం పోతాయి? ఈతచెట్టు క్రింద నిలబడినప్పుడు నీ కెవరైనా కన్పించారా??? ఈ చుట్టు ప్రక్కల ఎవరూ లేరు

తెల్సుకొన్న తర్వాతేకదా నిన్నిక్కడకు రమ్మన్నది.

"మీలాంటి పెద్దలు పరాయి స్త్రీని కోరుట తగునా? మీరు పలుగురికి మంచీచెడ్డా చెప్పేవారు మీరే ఇలాంటి పాడుపనులు చేయుట న్యాయమంటారా? దయచేసి విడువండి.

"విడువను పారూ! నిన్ను విడువలేను నీవు నాకు కావాలి.

పార్వతి కోపంతో కసిగా అంది "నీ వక్ర మనస్సులో కామరోగము, ఉన్నట్టున్నారే" అని పార్వతి కృష్ణమూర్తిని దూరంగా నెట్టివేయడానికి ప్రయత్నించింది.

"పారూ! నా శరీరంమీద నీ శరీరబలాన్ని ప్రయోగించి పారిపోదామని ప్రయత్నిస్తే మానసికంగానే కాదు శారీరకంగా కూడా బాధ పడతావు. ఉరుములు మెరుపులతో కూడిన ఈ గాలివానలో మానవుడే కాదు దేవుడు కూడా నీకు సహాయం చేయుటకు రాడు"

పార్వతి కొరకాలని తన్నాలని గుద్దాలని ప్రయత్నం చేసింది కాని ఆమె ప్రయత్నం ఫలించలేదు.

"అనవసరంగా ఎందుకు శ్రమపడుతావు పారూ! నాకు మనఃపూర్తిగా లొంగిపో నా శరీరంతో నీ శరీరంలో సౌఖ్యాన్ని సృష్టించుకో ఆనందాన్ని పొందడానికి ఎందుకు నిరాకరిస్తావు పారూ!" ఆ మాటలు వింటూ సహించలేకపోయింది. ఆమెకు కోపం, దుఃఖం వెల్లుబికి వచ్చాయి.

కృష్ణమూర్తి రాక్షస హస్తాల నుండి తప్పించుకోవడానికి పార్వతి పెనుగులాడింది. శీలాన్ని రక్షించుకోవడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నం చేసింది. చక్కిలిగింతలు పెట్టాడు. పురుష స్పర్శ ఎరుగని పార్వతి శరీరం ఆమె మనస్సుకు తెలియకుండానే కృష్ణమూర్తి చేయి చేష్టలకు లొంగిపోయింది, రెండు శరీరాలు కలిసిపోయింది.

పార్వతి కనులనుండి బయలుదేరిన కన్నీరు చెక్కిళ్ళ మీదుగా జారిపోతూవుంది. పార్వతి కన్నీటి ముఖాన్ని చూచి కృష్ణమూర్తి విజయగర్వంతో హేళనగా నవ్వాడు.

గది బయటకు వచ్చాడు. లేగ గది దగ్గరకు వస్తూవుంది. ఆవు పచ్చిగడ్డి తింటూనే వుంది. గదివైపు [illegible]గా నిలబడి పార్వతి ముఖంలోకి చూస్తున్నాడు.

లేగ దగ్గరకు వచ్చింది. కృష్ణమూర్తి తన కుడిచేయిని లేగపైవేసి నిమురుతున్నాడు.

చేయితో లేగను నిమురుతున్న దృశ్యం చూచిన ఆవుకు కోపం వచ్చింది. అది తివ్వన పరుగెత్తివచ్చి అతనిని పొడిచింది. అతడు వాన చినుకులతో ఏర్పడ్డ బురదలో పడ్డాడు, బురదలో పడ్డందున అతనికి ప్రమాదకరమైన దెబ్బలు తాకలేదు. కాని చర్మం చిట్లిపోయి రక్తం మాత్రం బయటకు వచ్చింది. ఒక్క క్షణం సిగ్గుపడ్డాడు కాని పార్వతికి లోకువవుతానని మరుక్షణంలో గంభీరంగా మారిపోయాడు.

ఆవు పొడిచినందుకు, అతడు బురదలో పడ్డందుకు పార్వతికి సంతోషంగానే వుంది. కాని ఆ సంతోషాన్ని తనదన్నిన బాధ కన్నీటి రూపంలో బయటకు వస్తూనే వుంది.

కృష్ణమూర్తి కొట్టం బయటకు పరుగెత్తివచ్చి, వానలో తడుస్తూ, భూమిపై పారుచున్న వాననీటితో తన శరీరానికి, బట్టలకు అంటిన బురదను కడుక్కొంటున్నాడు.

అతడు శరీరానికి, బట్టలకు అంటిన బురదను కడుక్కొగలుగుచున్నాడు, కాని మనస్సులో నున్న వక్రబుద్ధిని కడుక్కోలేకపోతున్నాడు కదా! అనుకుంది పార్వతి.

ఆమె ఏడుస్తూ తిట్టింది, తిట్టుతూ ఏడ్చింది.

పార్వతి మనస్సులోకి అకస్మాత్తుగా ఆరునెలల క్రితం జరిగిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది. "పెళ్ళికాని లీల గర్భవతి అయింది, లోకులు ఆమెను అసహ్యించుకున్నారు. పురుగును చూచినట్టు చూశారు, ఆమె తల్లిదండ్రులు ఆమెను ఇంట్లోనుండి వెడలగొట్టారు. ఆనాడే లీల బావిలో దూకి భయంకరంగా చనిపోయింది." అనాటి భయంకరమైన లీల చావు జ్ఞప్తికి రాగానే పార్వతి భయంతో వణికిపోయింది. "లీలలాగే తాను కూడా గర్భవతి అయితే..." ఈ ఆలోచనరాగానే పార్వతి నిలువెల్లా కంపించిపోయింది... లోకులు నిందిస్తారు, అసహ్యించుకుంటారు. తన తల్లిదండ్రులు తనను అసహ్యించుకొని ఇంట్లో నుండి బయటకు గెంటుతారు, అప్పుడు తనేం కావాలి? భగవాన్ నిస్సహాయ స్థితిలో ఒక దుర్మార్గుని కామానికి గురియైనందుకు తనపై ఎవరైనా సానుభూతి చూపిస్తారా? లేదు. [illegible]

పండును చూచినట్లు చూస్తారు. కుష్ఠురోగిని చూచినంత హీనంగా చూస్తారు. భవిష్యత్తులో తనకు రాబోయే బాధల నుండి తప్పించుకోవాలంటే ఒక్కటే మార్గం వుంది, తాను... తాను కష్టాలులేని లోకంలోకి దుర్మార్గులు లేనిలోకం లోకి శాశ్వతంగా... ఆ తర్వాత ఆలోచించలేక పోయింది.

భయంకరమైన ఆ గాలివానలో శరీరంలోనున్న శక్తినంతా కాళ్ళల్లో కేంద్రీకరించి పరుగులాంటి నడకతో ఉప్పొంగి వస్తున్న సెలయేటి వైపు నడకసాగించింది పార్వతి.




## ఓ మనిషీ! తెలుసుకో!

★

వెలిగించు వెలిగించు విజ్ఞానదీపం
తొలగించు తొలిగించు అజ్ఞాన రూపం
ఎందుకలా చీకటిలో మ్రగ్గిపోతావ్?
లేని కష్టాలను కౌగిలించుకుంటావ్!
నీకు నువ్వే ఆత్మ వంచన చేసుకుంటున్నావ్.
నీ దారి నువ్వు చూసుకో; నీ బ్రతుకు
నువ్వు సరిచేసుకో! నీ యింట్లో కాంతి
దీపం వెలిగించుకో!
అందరూ ఒకే దారిన పయనిస్తున్నారనుకోకు
నువ్వూ అదే మార్గం అనుసరించబోకు
ఎవరి అభిరుచులువారివి, ఎవరి ఆశలు వారివి
ఒకరితో నువ్వు పోటీపడబోకు!
నీ ప్రయత్నం మాత్రం నువ్వు మరచిపోకు
స్వార్థం పెరిగిన ఈ లోకంలోని స్వార్థం
మాయమైపోయింది; నిజాయితీకి విలువే
లేక వెల-వెల బోయింది, అందుకే
ఏ ఎండ కాగొడుగు పట్టాలి ఎవరి
దగ్గరఎలా మసలాలో అనేవిషయం ఆకట్టు
కోవాలి!
శిగ్గుపడితే ముందుకు వెళ్ళలేవు
ధైర్యం చేసివెళ్ళినా ముళ్ళబాధలు తప్పించు
కోలేవు!
అందుకే సాహసంచెయ్! అడుగు
ముందుకు వెయ్!

—కాళ్ళ గోవిందరావు.

★

## పొందును (పిల్లలపాట)

రాజు చాల ధనవంతుడనని
భోజులతో గర్వించుచుండును.
పెద్దకులములో పుట్టానంటు
పెద్దరికము చూపించుచుండును.
తరగతిలోని పిల్లలందరు
రాజుకు ఎంతోదూరముందురు.
రాము మాత్రము హరిజనుడైనా
రంజిలుచుండెను అందరిలోన.
మంచినడకతో తరగతి పిల్లల
మంచిజేసుకొని మెదులును రాము.
మనిషికి కులముతో పనిలేదు
ధనముంటేనే సరిపోదు,
మంచి మనసును కలిగినవాడు
అందరి ప్రేమను పొందును చూడు.

—ఎర్రోజు సత్యం.